# బియ్యం



''ఈ దేశంలో సోషలిజం సాధిం చాలంటే అట్టడుగు వర్గాలవారి బాగు ఓగులను నాయకులు పట్టించుకుని తీరాలి. స్వాతంత్ర్య సమరంలో మేమంతా ఎన్నో త్యాగాలు చేసి ఎంతో సంపద పోగొట్టుకుని ...'' ఇలా సాగిపోతూంది ఉపన్యాసం.

గాంధీ పార్కులో జనం క్రిక్కిరిసి లేరుగానీ పల్చ పల్చగా కూచుని వింటున్నారు. కొన్ని దశాబ్దాలుగా ఈ ఉపన్యాసాలు వినడం అలవాటయిపోయింది మరి. 1947 కి మునుపుకీ, ఇప్పటికీ ఉపన్యాస విషయము, ధోరణి పెద్దగా మార్పేమీ లేదేమో! అయితే అప్పుడు విషయం తెల్ల దొరయితే, ఇప్పుడు విషయం నల్లదొరలు.

## టి. వాణీరంగారావు

భాష, ఉద్రేకం, వినేవాళ్ళ చెవులకి ఒక్కటిగానే వున్నాయి. ఇలా అనిపించడం మొదలెట్టి చాలా కాల మయింది. జనంలో మాత్రం ఆనాటి ఆనందం, రిసెప్షన్, నమ్మకం లేవు. భారత, భాగవత, రామాయ ణాలలాగే వున్నాయి వాళ్ళకి.

అలాంటి ఒక ఉపన్యాసమే ఇది. ''గాంధీ పార్కు నిండా నేల ఈనినట్లుగా జనం, అత్యంత ఉద్వేగపూరిత వాతావరణంలో ఫలానా - ఫలానా విధంగా ఉపన్య సించారు'' అని రేపటి ఫలానా అనుబంధ పత్రికలలో వార్తలు రావచ్చుగానీ - అక్కడ మాత్రం ఎదురు బదురుగా గుంపులు గుంపులుగా జనం కూర్చుని వున్నారు. ఓపిక వున్నంతసేపు విని ఎవరి పాటికి వాళ్ళు లేచ్చక్కాపోతున్నారు.

వేదిక మీద బ్రహ్మాండంగా ఆ మాటాడే నాయకుని తాలూకు జండా ఆరూ, తొమ్మిదీ (అడుగులు) సైజులో వెనక వేళ్ళాడగట్టారు. ఆ బ్యాక్‌గ్రౌండులో అత్తా కోడళ్ళంచు పంచె, మాంచి పొందూరు ఖాది లాల్చీతో పచ్చని మేని రంగుతో పదరి ఉపన్యసించు సన్యాసిరావుగారు అందంగా, గ్లామరస్‌గా మెరిసి పోతున్నారు.

సభలో కూర్చున్నవాళ్ళకి ఆ లైట్ల వెలుగులో ఆయన వేసుకున్న బట్టలు ఒక్కోసారి పచ్చగా, ఒక్కోసారి గోల్డ్‌స్పాట్ రంగులోను బహుసుందరంగా కనిపిస్తు న్నాయి. ఆ వేదిక నిండా జనం. కుర్రాళ్ళూ, కుర్ర పిల్లలు, ఆడ పడుచులు, సోదరులు (బామ్మరుదులున్నా- వాళ్ళూ ఆ సభలో సోదర పాత్రలే ధరించారు మరి) వాళ్ళంతా ఆ ఉపన్యాసకుడి వంక ఆనందంగా, ఆరాధనతో, అత్యంత భక్తితో మాస్తున్నారు.

కింద నేల మీద కూచున్న వాళ్ళలో కూడా అన్ని వయసుల వాళ్ళూ వున్నారు. అందరికీ పురాణం వింటు న్న ఫీలింగు.

వేదిక మీద ఓ పెద్ద టేబిల్, దాని మీద ఫస్టుక్లాస్ అయిన కలంకారీ టేబిల్ క్లాత్, దాని మీద నాలుగు గ్లాసులలో (పెద్దవి) బియ్యం పోసి అందులో అగ రొత్తులు గుచ్చారు.

అగరొత్తుల పొగ మబ్బుల్లాగానూ, ప్రసంగిస్తున్న నాయకుడు ఆ మబ్బుల్లో దేవుడిలాగానూ కూడా కనిపిస్తున్నాడు అప్పుడప్పుడు.

ఆ వేదిక ముందే కూర్చుని వున్నారు పిల్ల గుంపు.

ఖరీదైన పిల్లగుంపు ఓ పక్కన వించుని వున్నారు. వాళ్ళు కూర్చోరు. వాళ్ళ నిక్కర్లకి మట్టి అంటుతుంది. ఫాషన్ గనక స్టోన్‌వాష్ అన్నా గోనెపట్టాలాంటి పాంట్లు మట్టి చేసుకుని తొడుక్కుంటారుగానీ - మట్టిలో కూర్చునే ఖర్మ వాళ్ళకు పట్టలేదు.



మరో పిల్ల గుంపు న్యూస్‌పేపర్లు వించి ఇళ్ళకు పోతూ లైట్లూ, హడావుడీ కనిపిస్తే వచ్చినవాళ్ళు. అసలు అదు కోడానికి రోజూ పార్కుకి వచ్చేవాళ్ళే వాళ్ళు. ఓ నిమిషం వించుని కాళ్ళు నెప్పెట్టి కూచున్నారు. వాళ్ళని కాకీ రంగు నిక్కర్లు - మాపు కనిపించదు.

మరో పిల్లగుంపు - వాళ్ళకి వెళ్ళేందుకు ఇళ్ళు లేవు. ఇంటికెళ్ళగానే అమ్మా, అయ్యా పండో, పాలో ఇచ్చేం దుకు హాజరుగా వుండరు. కొంపలో బుడ్డి దీపం మినుకు మినుకుమంటూ నిసుగ్గా వుంటుంది. అసలు కొందరికైతే ఇల్లే లేదు. వాళ్ళ చెడ్డీలు వాళ్ళ శరీరానికి అయిదారు రెట్లు పరిమాణంలో వుంటాయి. చాలా మందికి చొక్కాలు వుండవు. కొందరికి వున్నా వీపు మీద చినుగుతో చొక్కా అంచులు మోకాళ్ళ దాకా వేళ్ళాడుతుంటాయి. ఎవరికీ గుండీలు వుండవు. సాధార ణంగా చొక్కా కాలరో, చొక్కా చివరి అంచో వాళ్ళ నోళ్ళలో నలుగుతూ వుంటుంది. వీళ్ళే ఆ సభలో ఎక్కువ వున్నారు. వేదిక ముందు పరుచుకుని వున్నారు.

వేదిక మీంచి వినిపిస్తున్న అట్టడుగు, దళిత, ఆర్థి కంగా వెనుకబడిన, వెనుకబడిన తరగతులు, వగయిరా మాటలకి వాళ్ళకి అర్థాలు తెలియవు. పాపం అసలు ఈ నాయకులు పడే కష్టమంతా, ఈ చేసే పోరాటమంతా తమ కోసమేనని కూడా తెలియదు.

అసలు తామే ఆ గొడవలకు హీరోలమని తెలిస్తే 'ఇంతై వటుడింతై' అన్నట్టు పొంగిపోతారు. ప్రస్తుతం పొంగిపోవడం లేదుగానీ సరయిన అర్థాలు తెలియనందు వల్ల విస్తృతంగా పెరిగిపోతున్నారు.

వాళ్ళలో కొందరు మకిలి పురుగుల్లాగా నేల మీద పడుకుని వేదిక మీది తతంగాన్నంతా పరికిస్తున్నారు. కొందరు మోకాళ్ళలో తలపెట్టుకుని కడుపుకి కాళ్ళని, చేతుల్ని కాపలా పెట్టినట్టు ముడుచుకుని కూర్చున్నారు. కొందరు మాత్రం ఇసకతో ఆడుకుంటున్నారు. కొందరు క్రిందపడిన వేరుసెనక్కాయల తొక్కుల్లో ఓ వేరు సెనగ పలుకు దొరుకుతుందేమోనని, మానె అంటిన కాయితాలలో పకోడీ ముక్కో, శెనగపిండి అంటుకుని వున్న మిరపకాయ బజ్జీ తొడిమె అయినా దొరుకుతుందేమోనని వెతుక్కుంటున్నారు.

ఒక్క పిల్లాడు మాత్రం ఆశగా వేదిక మీదికి మాస్తున్నాడు. వాడి దృష్టి అంతా వేదిక మీదే వుంది. శ్రద్ధగా వింటున్నట్టు వుంది. వేదిక మీది వాళ్ళను

శల్యపరీక్ష చేస్తున్నట్లు వుంది. వాడి కళ్ళలో నీటిపొర ఎప్పుడూ కదుల్తూ వుంటుంది. కొందరికి ఆ కూర్చున్న తీరు, ఆ చూపు కొన్ని వేల ప్రశ్నలు వేస్తున్నట్టనిపించ వచ్చు.

ఏమయినా వాడు మాత్రం తదేకంగా చూస్తున్నాడు- వేదికవైపు - వేదిక మీద అగరొత్తులయిపోయాయి. మూడు నిమిషాల్లో మళ్ళా మరో మూడు కట్టలు వెలిగించారు. ఆ వెలిగించడం ఆ తొందర చూస్తోంటే ఆ అగరొత్తులే లేకపోతే వేదిక మీద వీచే దుర్గంధం తట్టుకోవడం కష్టమేమో అనిపిస్తుంది. మళ్ళీ ఆ అగరొత్తులు కాలిపోయేదాకా పొగ ... పొగ. వేదిక అంతా సువాసన. అందులో ఏ దుర్గంధమైనా కొట్టుకుపోతుంది మరి.

ఇంకో గుప్పెడు మంది మహోపన్యాసకులు అదరగొట్టేంతవరకూ ఆ అగరొత్తులు వెలుగుతూనే వున్నాయి. సభ అయిపోయింది. దడదడా ధనధనా వేదిక దిగి నాయకులు పడవలంత కార్లలోను, బుజ్జి బుజ్జి చిన్న చిన్న ఎర్రెర్రని కార్లలోనూ సంగీత ధ్వనుల్లాంటి హారన్లు కొట్టుకుంటూ వెళ్ళిపోతున్నారు.

వాడి దృష్టి మాత్రం వేదిక మీదే వుంది.

వేదిక మీంచి బల్లలూ, కుర్చీలూ క్రిందికి చేరవేస్తున్నారు. టేబిల్ మీద నుంచి గ్లాసులు తీసి భద్రంగా వేదిక పక్కన స్తంభం చాటున క్రింద పెట్టారు. గభాలున లేచాడు వాడు. వేదిక మీద నుండి వాడి దృష్టి మారింది.

గబగబా నాలుగు అంగల్లో వేదిక మీది స్తంభం దగ్గరకు వెళ్ళాడు. వంగి నెమ్మదిగా ఒక్కో గ్లాసే తీసుకున్నాడు. చొక్కా చెంగులు పైకి ఎత్తి ఒళ్ళో బియ్యం పోసుకున్నాడు. ఎటూ చూడడంలేదు. ఎవర్నీ పట్టించుకోవడం లేదు. చొక్కా అంచులు జారిపోతాయేమోనన్న భయమే వాడి చేష్టల్లోనూ, కళ్ళల్లోనూ కనిపిస్తోంది.

ఇంతలో వాడి వీపు మీద ధనామని దెబ్బ పడింది. వాడు బోర్లా పడ్డాడు. చొక్కా చెంగులు మాత్రం ఒదిలి పెట్టలేదు.

"లం ...... కొడకా! దొంగ నా ......... కొడకా! నీ యమ్మ ..." తిట్ల ప్రవాహం, దెబ్బల దాడి.

వాడు కదలడం లేదు.

బియ్యం ... బియ్యం ...

ఆకలి ... ఆకలి ...

అదే వాణ్ణి ఆ మట్టి మీదే పడి దొర్లి మట్టినే పీర్చి మట్టి పూసుకునేట్లు చేస్తోంది.


**బియ్యం ... ... ఆకలి.**

**ఆకలి ... ... బియ్యం.**

*

# చిలకమర్తి జీవితంలో...

## చిలకమర్తి 41వ వర్ధంతి సందర్భంగా



నేటికి సుమారు డెబ్బై సంవత్సరాల క్రితం పిఠాపురం కోటలో జరిగిన మధురమైన సంఘటన. 'విశ్వకవి' రవీంద్రుని 'ఆంధ్ర మిల్టన్' చిలకమర్తి సందర్శించి ఆనంద పరవశుడైన ఘట్టం. ఠాగూర్ 1918 సం. అక్టోబర్‌లో పిఠాపురం రాజావారి ఆహ్వానంపై పిఠాపురం వచ్చి కోటలో బస చేశారు. అపుడు చిలకమర్తి వారిని చూడడానికి రాజమహేంద్రి నుండి వెళ్ళారు.

అప్పటికే చిలకమర్తి "భరత ఖండంబు చక్కని పాడి యావు", "పెరశాలల్ పృథు చంద్రశాలలె" మొదలైన పద్యాల ద్వారాను, జాతీయ కాంగ్రెసు మహాసభలలో పాల్గొని జాతీయాభిమానాన్ని వెల్లడించుకొని లబ్ధ ప్రతిష్ఠులైనారు. విశ్వకవి రవీంద్రుడు వీరిని చూచి ఆనందించారు. చిలకమర్తి పద్యాలను చదవమని, ఇంగ్లీషులో అర్థం చెప్పించుకుని విని ఎంతో అభినందించారు.

చిలకమర్తి, రవీంద్రుల సమావేశానంతరం కోటలో సభ ఏర్పాటు చేశారు. పిఠాపురం రాజావారు, రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ఆ సభలో పాల్గొన్నారు. ప్రార్థన ప్రయోజనం గురించి ప్రసంగించమని రవీంద్రుని చిలకమర్తి కోరారు. సుమారు అరగంట సేపు రవీంద్రుడు ఇంగ్లీషులో అద్భుతమైన ప్రసంగం చేశారు. రవీంద్రుని కంఠధ్వని మధురంగా, శ్రావ్యంగా వున్నట్టు ఉపన్యాసము విని తాను ధన్యుడైనట్టు చిలకమర్తి ఆనందించారు. "లోకారాధ్యుడు, మహా కవీశ్వరుడైన రవీంద్రుని కలసికొని సంభాషించడం జీవితంలో మరువలేని మధుర సంఘటన" అని తన స్వీయ చరిత్రలో చిలకమర్తి వ్రాసుకొన్నారు. అట్టి మహనీయులను తలవడం వాగ్దేవిని కొలవడం!

— పెరుమాళ్ళ రఘునాథ్

## కారు కొన్న శ్రీశ్రీ

నేను మద్రాసు చేరిన కొత్త రోజులు. రూము దొరకడం చాలా కష్టమైంది. చివరికి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారిల్లు ఖాళీగా వుండడంతో వారి పర్మిషన్‌తో అక్కడ ఆశ్రయం దొరికింది. అక్కడ ప్రఖ్యాత కవి గిరీశం పోజులో సర్దా పురుషుడు, చొక్కా చొక్కాల క్రాపింగ్, రోల్డు గోల్డు అద్దాలు, లాల్చీ పైజామా ధరించే శ్రీరంగం నారాయణ బాబుగారు ఒక్కరూ ఆ యింట్లో వుండేవారు. పొద్దున కాఫీలు, సిగరెట్లయ్యాక కబుర్లూ, కవిత్వాలు మా కాలక్షేపం. స్నానాలయాక పాండీ బజార్లో నారాయణ కేఫ్‌లో యిడ్లీ తినడానికి పోయేవాళ్ళం.

ఒకనాడు అలా పోతూంటే ఒక కొత్త స్టాండర్డు కారు హారన్ కొట్టి మమ్మల్ని ఆపింది. ఆగింది మా పక్కన.

కారులోంచి "ఒరే! నారాయణబాబూ! నేనురా... శ్రీశ్రీని" అంటూ శ్రీశ్రీ కారు దిగేరు. నారాయణబాబు కారువంకా, శ్రీశ్రీ వంకా చూశారు. "ఏమిట్రా అలా చూస్తావు...నేనురా శ్రీశ్రీని. కారు కొన్నానురా." కొంచెం ఆగి "వెరీ గ్లాడ్" అన్నాడు నారాయణబాబు.

"చూడవోయ్ శాస్త్రీ! వీడికింకా నమ్మకం కుదరడం లేదు" అన్నారు శ్రీశ్రీ నావంక చూసి.

"సరే! ముందు టిఫిను తిందాం పదండి. అక్కడ మాట్లాడుకుందాం" అని హోటల్లోకి దారి తీశారు శ్రీశ్రీ. అప్పుడే డబ్బింగ్ పిక్చర్లు బాగా వ్రాసి గడిస్తున్నారు.

అంతా కడుపునిండా తిన్నాం. నారాయణబాబు జేబులోంచి బర్కిలీ పాకెట్టు తీశాడు.

"ఆ సిగరెట్ కాల్చకు. నేను కొనిస్తాను అవి తాగు" అని బర్కిలీ టిన్ కొనిచ్చారు శ్రీశ్రీ. మమ్మల్ని కారెక్కమన్నారు.

"పక్కనే గోపాల కృష్ణారోడ్డులోనే మా రూం. అక్కడికి కారెందుకురా?" అన్నారు నారాయణబాబు.

"ఈ శ్రీశ్రీకి ఈ కారెన్నాళ్ళుంటుందో? రావోయ్!" అంటూ కారులో డ్రాప్ చేశాడు మా రూం దగ్గర శ్రీశ్రీ. కారెళ్ళిపోయింది.

"బాబుగారూ! సిగరెట్ టిన్ వుంది కదా అని తాగుతూ కూచుంటారేమో? వీల్లేదు" అన్నాను.

"మనకు స్వతంత్రమొచ్చిందని అందరూ అంటున్నారు. మరి నువ్వేదేమిటి శాస్త్రీ" అన్నారు బాబుగారు.

"మంచి పొయెట్రీ రాయాలి యివి అయ్యేలోగా" అన్నాము.

"ఓ! తప్పక రాద్దాం"మన్నారు. మొత్తం టిన్ను సిగరెట్లు తాగారు. కాని, పొయెట్రీ మొత్తం రాయలేదు ఆ రాత్రిలోగా.

మర్నాడు మా యిద్దరి వద్దా కాపర్సు తగ్గాయి. అప్పుడు అర్జంటుగా వ్రాశారు నారాయణబాబు.

— చెరువు ఆంజనేయశాస్త్రి